## క్లుప్తంగా

### గోరక్షక్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజ్‌కుమార్



ముషీరాబాద్: నమో మిషన్ వందే గోమాతరం గోరక్షక్ వింగ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తంగళ్ల రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఆయనను నమో మిషన్ వందే గోమాతరం వ్యవస్థాపక అధ్యక్షుడు మధ్విరాజ్ ఆచారి సిపెల్లి శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో గోమాత విశిష్టతను చాటి చెప్పి గోరక్షణకు నడుంబిగిస్తానని ఈ సందర్భంగా రాజ్‌కుమార్ ప్రకటించారు.

### 'అన్నం పరబ్రహ్మ స్వరూపం'

కాచిగూడ: అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానానికి మించిన దానం మరోటి లేదని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి వేణుగోపాలాచారి అన్నారు. సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు సహకారంతో వీబీజీ రాజు ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని అన్నదానం చేశారు. ప్రసన్న సత్యవతి, నిఖిత, సంపత్, సంతోష్, పోల శ్రీనివాస్, సాయిప్రసాద్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్‌ఎస్ సీనియర్ నేత అంబటి రవి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను గోల్నాక డివిజన్ కాచిగూడ కమేళా వద్ద ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కాలేరు రాజు, రాము, శ్రీనివాస్, శ్రీహరి, రాకేష్ తదితరులున్నారు.

### ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

అంబర్‌పేట: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని బేగంపేట ట్రాఫిక్ పోలీస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. శుక్రవారం డీడీ కాలనీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పవర్‌పాయింట్ ద్వారా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ తల్లిదండ్రులకు తీరని విషాదాన్ని నింపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్ ఠాకూర్, హెచ్‌ఓడీలు సరస్వతి, వేంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది రత్నరాజు, రాము, నారాయణరెడ్డి, వెంకట్‌ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

### నియామకం



నల్లకుంట: ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ (ఏఐసీడబ్ల్యూసీ) మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా జయంతి, ఉపాధ్యక్షురాలిగా శీతల్ జైస్వాల్, అధికార ప్రతినిధిగా న్యాయవాది సునకర నియమితులయ్యారు. ఏఐసీడబ్ల్యూసీ జాతీయ అధ్యక్షుడు అశ్విన్ మెహదీయా ఆదేశాల మేరకు ఏఐసీడబ్ల్యూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవేందర్ తివారి నూతనంగా నియమితులైన వారికి శుక్రవారం నియామక పత్రాలను అందజేశారు. ఏఐసీడబ్ల్యూసీ జాతీయ నాయకులు మరియారింగ్, కవితసీజన్, కార్యదర్శి సూర్యప్రకాష్, అధికార ప్రతినిధి ఐజాక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### హత్య కేసులో నిందితుడి కోసం గాలింపు

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివేక్‌నగర్‌లో ఈ నెల 14న శ్రీను హత్యకేసులో నిందితుడి కోసం గాలింపు ముమ్మరంగా కొనసాగుతోంది. నిందితుడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాల్లో వేట సాగిస్తున్నాయని ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. కాగా నిందితుడి కదలికలు సీసీ పుటేజీల్లో నమోదయ్యాయని నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

### అలరించిన మెగా అవార్డ్స్

చిక్కడపల్లి: బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీత, నృత్య ప్రదర్శనలు సందడిగా జరిగాయి. నాట్య గురువు కవిత శిష్య బృందం అక్షర, సహస్ర, ప్రణవి, తల్లి గాయత్రి, లిఖిత, వైష్ణవి, ప్రణయశ్రీ, రజని, నిత్యప్రియ, కౌస్తుభ తదితరుల నాట్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్ పాల్గొని బాలలను అభినందించి కళలు ఉత్తమ సంస్కారం నేర్పుతాయన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు విక్కీమాస్టర్ అధ్యక్షత వహించిన సభలో జ్యోతిష్యశాస్త్రంలో డాక్టరేట్ అందుకున్న సత్యనారాయణను సత్కరించారు. సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు, శిరీష ఓంప్రకాష్‌యాదవ్

**ముషీరాబాద్/ అంబర్‌పేట్ జోన్ పరిధిలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి పలుచోట్ల వృద్ధులకు పండ్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి అన్నదానం చేశారు.**

– ముషీరాబాద్, అంబర్‌పేట్ జోన్ బృందం

◆ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు మోజెస్, రమేష్‌యాదవ్, సీనియర్ నాయకులు శంకర్‌ముదిరాజ్, అడిక్‌మెట్ డివిజన్ నేతలు సయ్యద్ అస్లాం, నేత శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేందర్, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌రావు, ముచ్చకుర్తి ప్రభాకర్ హాజరయ్యారు.

◆ రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. దామోదర్‌రెడ్డి, వెంకటకృష్ణ, కిషన్‌రావు, జయదేవ్, మురళీ, ఎర్రం శేఖర్, నాగభూషణం, శ్రీను తదితరులున్నారు.

◆ దోమలగూడలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు సాయికృష్ణ ఆధ్వర్యంలో ఆశావర్కర్లకు చీరలను పంపిణీ చేశారు. డివిజన్ కార్యదర్శి శ్యామ్‌యాదవ్, నాయకులు రాంచందర్, ప్రభాకర్‌శామల, శ్రీకాంత్, ఉమేష్, రాజశేఖర్ ఉన్నారు.

◆ భోలక్‌పూర్ ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఎంఎన్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహ్మా, రజనీకాంత్, మనోహర్‌సింగ్, శ్రీను, గోవింద్ తదితరులున్నారు.

◆ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నియోజకవర్గంలోని 5 డివిజన్లతో పాటు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మందులు పంపిణీ చేశారు.

◆ కాచిగూడ డివిజన్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. దిడ్డి రాంబాబు, ఎర్ర భీష్మదేవ్, సదానంద్, నాగేందర్ బాబ్జీ, రవీందర్‌యాదవ్, దేవిరెడ్డి విజితారెడ్డి, కృష్ణాగౌడ్, శేషు తదితరులున్నారు.



లక్ష్మీగణపతి దేవాలయంలో మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



న్యాయవాదుల ఆధ్వర్యంలో..



అంబర్‌పేట బాపూనగర్ ఉచిత వైద్య శిబిరంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు

## మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు



న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతీ ఆలయం

నల్లకుంట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లకుంట డివిజన్ పరిధిలోని శివాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. శనివారం న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణాధికారి(ఈఓ) జయంతి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం 6 గంటలకు ఏక రుద్రాభిషేకము, 8.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఉంటుందని రాత్రి 10 గంటలకు శివ పార్వతుల కల్యాణం, 12 గంటలకు అన్నాభిషేకం ఉంటుందని వివరించారు. ఏక రుద్రాభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించాలనుకునే భక్తులు ఆలయ అర్చక స్వాములను సంప్రదించాలన్నారు.

## కార్పొరేటర్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే నాయకులకు ప్రజల్లో ఆదరణ ఉంటుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఏర్పాటు చేసిన కార్పొరేటర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబర్‌పేట డివిజన్ సమగ్రాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తనపై విశ్వాసం ఉంచి కార్పొరేటర్‌గా గెలిపించిన అంబర్‌పేట డివిజన్ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండేందుకు కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ విజయ్‌కుమార్ వివరించారు. స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

## ప్రజలు ఆశీర్వదిస్తే వైఎస్‌ఆర్ పాలన అందిస్తాం



షర్మిల పాదయాత్రలో వైఎస్‌ఆర్‌టీపీ నాయకులు ఆకుల ప్రవీణ్

కవాడిగూడ: రాష్ట్ర ప్రజలు ఆశీర్వదిస్తే వైఎస్‌ఆర్ పాలన తిరిగి అందిస్తానని వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజలకు భరోసా ఇచ్చారు. శుక్రవారం వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్వహిస్తున్న పాదయాత్రకు వైఎస్‌ఆర్‌టీపీ ముషీరాబాద్ కో–ఆర్డినేటర్ ఆకుల ప్రవీణ్ సంఘీభావం తెలిపారు. అనంతరం కవాడిగూడలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేయడం కోసం నేటికి 3,800 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడకుండా భూకబ్జాలు చేస్తూ ప్రజలపై దౌర్జన్యాలు పాల్పడున్నారని ఆరోపించారు. వైఎస్‌ఆర్ విగ్రహాన్ని ప్రజలు ఏర్పాటు చేసుకుంటే దాన్ని అడ్డుకునేందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రయత్నించారన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తిరిగి వైఎస్‌ఆర్ సంక్షేమం, అభివృద్ధి దక్కాలంటే వైఎస్‌ఆర్‌టీపీ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## చిట్టీల నిర్వాహకుడిపై బాధితుడి ఫిర్యాదు

ముషీరాబాద్: నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ చిట్టీల నిర్వహుడిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రసాద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్‌లో నివసించే వెంకన్నగారి గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి గత 12 ఏళ్లుగా చిట్టీలు వేస్తున్నారు. తాజాగా రూ.9 లక్షలు, రూ.15 లక్షల చిట్టీలు వేసి వాటిని పాడుకుని నెలలు గడిచినా.. తిరిగి డబ్బులను చిట్స్‌ఫండ్ యజమాని ఇవ్వడం లేదని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. తనతో పాటు అనేక మందికి చిట్టీలు ఎత్తుకున్న తర్వాత డబ్బులు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పికుంటున్నారన్నారు. ఫోన్ చేస్తే స్పందించడం లేదని ఎస్సై ప్రసాద్‌కుమార్ వివరించారు. అతడిపై కేసు నమోదు చేసి విచారిస్తామమన్నారు. గతంలో కూడా ఈ చిట్స్‌ఫండ్‌పై ఫిర్యాదులు అందాయని పోలీసులు తెలిపారు.

## 'సామాన్యులపై ధరల భారం'




పెరిగిన గ్యాస్ ధరల గురించి వివరిస్తున్న దృశ్యం

కవాడిగూడ: కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై గ్యాస్, పెట్రోల్, నిత్యవసర ధరలు పెంచి ప్రజలపై భారం మోపుతోందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు. శుక్రవారం 'హాత్ సే హాత్ జోడో' కార్యక్రమంలో భాగంగా కవాడిగూడ డివిజన్‌లో తహసీల్దార్ కార్యాలయం, ఎల్‌ఐసీ పరిసర బస్తీలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి జోడో ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజల సంక్షేమం కోసం పాటుపడతానని చెప్పి ఆచరణలో దానికి భిన్నంగా ప్రజా వ్యతిరేక విధానాలను చేపడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీలను కార్పొరేట్ సంస్థలకు అమ్ముకుంటున్నార న్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం ఓట్ల రాజకీయానికే ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ముషీరాబాద్ ఏ–బ్లాక్ అధ్యక్షులు వీ.డీ.కృష్ణ, సీనియర్ నాయకులు శ్రీరాములుయాదగిరి, పాశం అనిల్‌కుమార్‌యాదవ్, వాజీద్‌హుస్సేన్, సాయిబాబా, ధర్మేందర్, లక్ష్మణ్, సురేష్ తదితరులున్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

చిక్కడపల్లి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చిక్కడపల్లి ఎస్సై నాగరాజు సూచించారు. దోమలగూడ సెక్టార్‌లోని సూరజ్ నగర్ బస్తీలో శుక్రవారం చిక్కడపల్లి పోలీసులు కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బ్యాంక్ అకౌంట్‌లో నుంచి ఎవరైనా డబ్బులు సైబర్ నేరగాళ్లు చోరీ చేసినట్లు గ్రహిస్తే వెంటనే కాల్ చేసి వివరాలు తెలియజేస్తే డబ్బులు తిరిగి రావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. సమాజంలో వైట్ కాలర్ నేరాలు బాగా పెరిగిపోయాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మద్యం, డ్రగ్స్, మాదకద్రవ్యాలకు యువత బలి కాకుండా తల్లిదండ్రులు వారిని ఎప్పటికప్పుడు కనిపెట్టుకుని ఉండాలన్నారు. ఎలాంటి భద్రతా సమస్యలు ఎదురైనా డయల్ 100కు ఫోన్ చేయాలనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బస్తీ కమిటీ, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా బస్తీ ప్రజల సంక్షేమం రక్షణ సాధ్యమవుతుందని వివరించారు. హెడ్‌కానిస్టేబుల్ హనుమంతరావు, కానిస్టేబుల్‌లు ఆంజనేయులు, విజయకుమార్‌గౌడ్, హోంగార్డ్ కాశీపతి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ పుస్తకావిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రెడ్ బుక్ డే ఫిబ్రవరి 21 నుంచి భగత్‌సింగ్ వర్ధంతి మార్చి 23 వరకు భగత్‌సింగ్ పుస్తకాలను అధ్యయనం చేయాలని వామపక్ష యువజన, విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం భగత్‌సింగ్ సహచరుడు శివవర్మ రచించిన విప్లవ కెరటం భగత్‌సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. భగత్‌సింగ్ ఎవరి కోసం పని చేశాడు.. తన ఆలోచనలు ఎంటో ప్రజలకు తెలియాలంటే ఆయనపై రచించిన పుస్తకాలను అధ్యయనం చేయాలని ప్రజలకు సూచించారు. దీనిలో భాగంగానే ఈనెల 21న రెడ్ బుక్ డే సందర్భంగా భగత్‌సింగ్ పుస్తకాలను సామూహికంగా మార్చి 23 వరకు యువత, విద్యార్థులు భగత్‌సింగ్ పుస్తకాలను అధ్యయం చేసి ఆయన స్ఫూర్తిని పొందాలన్నారు. కృష్ణారెడ్డి, తెలంగాణ సాహితి కార్యదర్శి ఆనందాచారి, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, నగర కార్యదర్శి ఆశోక్‌రెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లాద్రిఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు జన ఆరోగ్య యోజన



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌యాదవ్

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో జన ఆరోగ్య యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్ అన్నారు. కాచిగూడలో జరిగిన ఓబీసీ మోర్చా పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన 25 దేశాల జాబితాలో భారతదేశాన్ని మూడో స్థానంలో నిలిపి దేశ గౌరవాన్ని పెంచిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని కొనియాడారు. రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృత స్థాయిలో తీసుకెళ్లే పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పార్టీ ఓబీసీ నేతలు రమేష్, వెంకటేష్, కిషోర్, ఎస్.వెంకటస్వామిగౌడ్, విజయకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్‌ను ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి



ఆయుష్మాన్ భారత్ నమోదు ప్రక్రియను ప్రారంభించిన కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి: నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్రం ప్రవేశపెట్టిన ఆరోగ్య బీమా ఆయుష్మాన్ భారత్‌ను ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధి గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో ఏర్పాటు చేసిన నమోదు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకంలో భాగంగా ప్రకటించిన ఆయుష్మాన్ భారత్, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద పథకమని అన్నారు.

◆ ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఏటా కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు.

◆ దేశంలో ఎక్కడైనా ప్రభుత్వ, ప్రైవేట్, ఎంప్యానల్ ఆసుపత్రిలో లబ్ధిదారులు చికిత్స చేసుకునేందుకు ఈ–కార్డ్‌ను ఉచితంగా పొందుతారన్నారు.

◆ తెల్లరేషన్ కార్డులో పేరు నమోదు చేసుకున్న వారితో పాటు బట్టలు ఉతికేవాళ్లు, చౌకీదార్లు, పేదలు ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలన్నారు.

◆ చేతి వృత్తులు, హస్తకళ కార్మికులు, కుట్టుపని చేసేవారు, చిరు వ్యాపారులు, సెక్యూరిటీ గార్డులు, డ్రైవర్లు, రిక్షావారు, డెలివరీ బాయ్స్, వెయిటర్లు అందరూ ఈ పథకంలో నమోదు చేసుకోవచ్చని కార్పొరేటర్ వివరించారు. ఈ సందర్భంగా అర్హులైన వారికి ఈ – కార్డులను బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్ అందజేశారు. బీజేపీ నాయకులు నర్సింగ్‌రావు, ఉమేష్, ఆకుల సురేందర్, నవీన్‌కుమార్, రహమత్ అలీ, జేడీ. రాజు, బస్తీవాసులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న గారె వెంకటేష్ మాదిగ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేష్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని టీఎంపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తే అనగారిన వర్గాల వారు జీవితాంతం గుర్తు పెట్టుకుంటారన్నారు. గత కొన్నేళ్ల నుంచి తాత్కాలిక భృతిపై పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారన్నారు. లక్ష మంది పారిశుద్ధ్య కార్మికుల శ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుని కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా వారిని పస్తులు ఉండేలా అవమానాలకు గురి చేయడం బాధాకరమన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సరైన వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారు అత్యధికులు దళిత వర్గాల వారే ఉన్నారన్నారు. మహిళా కో–ఆర్డినేటర్ రోషిన్ విజయలక్ష్మి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి లక్ష్మీబాయి, పుష్ప, శోభా, సరిత తదితరులున్నారు.

## సాయిబాబా దేవాలయంలో స్థానికులకే సభ్యత్వం కల్పించాలి



సమావేశంలో ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కవాడిగూడ: ఎస్‌బీఐ కాలనీలో ప్రసిద్ధిగాంచిన షిరిడీ సాయిబాబా దేవాలయ కమిటీలో కాలనీవాసులకే సభ్యత్వం కల్పించాలని ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయిబాబా దేవాలయ ట్రస్టీ చైర్మన్ పీ.వీ.రమారావు ఆలయ కమిటీలో స్థానికేతరులను నియమించారని ఆరోపించారు. కాలనీ అసోసియేషన్‌లో 207 మంది సభ్యులు ఉన్నారని కాలనీ సభ్యులనే ఆలయ కమిటీలో నియమించాలన్నారు. పద్మశాలి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కామరాజు, డైరెక్టర్ శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సర్వారాయుడు, కోశాధికారి లక్ష్మణ్, సభ్యులు కృష్ణానంద్, దత్తాత్రేయ, సరళ, సీతమ్మ, రఘువీర్, వెంకట్‌నాథ్, వినయ్, కృష్ణానంద్‌శర్మ తదితరులున్నారు.

## రేషన్ షాపుల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

కవాడిగూడ: తెల్లరేషన్ కార్డుదారులకు ప్రతినెలా సక్రమంగా నిత్యవసర వస్తువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సర్కిల్–6 సివిల్ సప్‌లై సూపరింటెండెంట్ వరలక్ష్మి అన్నారు. రేషన్ డీలర్లు ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా రేషన్‌కార్డు దారులకు ప్రతినెలా సరుకులను ఇవ్వాలని దీనికోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. శుక్రవారం సర్కిల్–6 పరిధిలోని దోమలగూడ మున్సిపల్ మార్కెట్ వద్ద ఉన్న 611 నెంబర్ రేషన్ షాపులో సోషల్ ఆడిటింగ్‌లో భాగంగా సివిల్ సప్‌లై సూపరింటెండెంట్ కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీతో కలిసి తనిఖీలు నిర్వహించారు.

◆ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు రేషన్‌షాపుల్లో అందిస్తున్న సరుకులు సక్రమంగా అందుతున్నాయా.. లేదా అని తెలుసుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సివిల్ సప్‌లై ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, రేషన్ షాపు డీలర్ కె.ఆర్.కె.ప్రసాద్, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, కుమార్‌గౌడ్, పరశురాం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

నల్లకుంట: క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన మహావీర్ జైన్ అలియాస్ రవీందర్ (47) జీవనోపాధి కోసం నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చాడు. క్యాటరింగ్ కుక్‌గా పనిచేస్తున్న అతడు విద్యానగర్ అంజయ్యనగర్‌లోని 2-2-1/7 ఇంట్లో గత నాలుగేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా అతడి గదికి లోపలి నుంచి గడియపెట్టి ఉంది. కాగా.. ఈనెల 16న మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంటి యజమానురాలు భాగ్యలక్ష్మి అనుమానంతో గది వద్దకు వచ్చి చూడగా.. దుర్వాసన వచ్చింది. దీంతో వారి షాపులో పనిచేసే వ్యక్తిని పిలిపించి విషయాన్ని చెప్పగా.. అతడు పోలీసులకు సమాచారం అందించాడు. వారు గది తలుపులు బద్దలు కొట్టి చూడగా రవీందర్ గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉన్న రవీందర్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. గుజరాత్‌లో ఉండే మృతుడి సోదరుడు, సోదరికి పోలీసులు సమాచారం అందించారు. ఇంటి యజమానురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థి అదృశ్యం

చిక్కడపల్లి: డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శాంతాపూర్‌కు చెందిన పిల్లి కృష్ణయ్య కుమారుడు నవీన్‌కుమార్ (22) నగరంలోని దోమలగూడ ఏవీ కాలేజీలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కాగా శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల వద్ద ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.